క్లుప్తంగా

బీరన్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలోని బీరన్న ఆలయంలో బీరన్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పూజారులు సామూహిక హోమం నిర్వహించారు. శుక్రవారం నాడు విగ్రహ ప్రతిష్ఠాపన, మే 3న లింగాలను గంగలో వేసే కార్యక్రమం, 4న లింగాలను గంగ నుంచి తీసే కార్యక్రమం, 5న స్వామి వారి కల్యాణం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కులపెద్దలే అన్న లక్ష్మణ్, అన్న రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాస చేరాలు, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

'జేఈఈ మెయిన్స్'లో విద్యార్థుల ప్రతిభ

ఖానాపురం : జేఈఈ మెయిన్స్ పరీక్షలో మండలంలోని అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ శ్రీనివాసస్వామి, డైరెక్టర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్కూల్‌లో వారు మీడియాతో గురువారం మాట్లాడారు. స్కూల్‌కు చెందిన 40 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 19 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కావలి ప్రశాంత్ 85 శాతంతో మొదటి, ప్రదీప్‌కుమార్ 77 శాతం మార్కులతో రెండో స్థానంలో నిలిచినట్లు వివరించారు.

ఇంటర్‌లో కేజీబీవీ విద్యార్థిని..



చెన్నారావుపేట : ఇంటర్ పరీక్షలో మండలంలోని బోజెర్వు గ్రామానికి చెందిన వంగ సాంబరాజు–రజిత దంపతుల కూతురు ఐశ్వర్య ప్రతిభ చాటింది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ) జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సర పరీక్షలో 440కి గాను 415 మార్కులు సాధించింది. ఐశ్వర్యను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు ఆ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తాను కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నట్లు తెలిపారు. తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తనకు సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తన అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని వివరించారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి మల్లయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి గురువారం రూ.3 వేల సాయం అందజేశారు. ఈ మేరకు ఆయన పంపించిన నగదును ఆ పార్టీ నాయకులు అల్లం మర్రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి రాంబాబు, కందికొండ రాజ్‌కుమార్, తోట కమలాకర్, మంద రమేశ్, మత్తిని భాస్కర్, వీరబద్రయ్య పాల్గొన్నారు.

బియ్యం అందజేత



రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన దయ్యాల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి సోల్జర్ యూత్ సభ్యులు గురువారం బియ్యం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుక్కల భాస్కర్, సోల్జర్ యూత్ అధ్యక్షుడు నందనబోయిన సాంబశివ, ఉపాధ్యక్షుడు ఎన్ ప్రభుదేవా, కార్యదర్శి వంశీ, సోమరాజు, సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్కీడ్రా

దామెర : తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం పొందే నాన్ మైనారిటీ విద్యార్థుల కోసం ప్రవేశాలు కల్పించేందుకు రేపు (27న) ఉదయం 10 గంటలకు లాటరీ (లక్కీడ్రా) నిర్వహిస్తామని ఓగ్లాపూర్ (పరకాల) స్కూల్ ప్రిన్సిపల్ శ్రీలత గురురవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

అవగాహనతో మలేరియా నివారణ



ఖానాపురం : ర్యాలీలో డాక్టర్ జ్యోతి, తదితరులు

ఖానాపురం : అవగాహన పెంచుకోవడం ద్వారా మలేరియాను నివారించొచ్చని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ జ్యోతి తెలిపారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా మలేరియా, ఇతర రోగాలకు దూరంగా ఉండొచ్చన్నారు. నీటి నిల్వలున్న చోట కిరోసిన్ లేదా వాడిన నూనెను చల్లాలని, శుక్రవారాలను డ్రై డేగా పాటిస్తూ నీటి నిల్వలను తొలగించాలని కోరారు. తద్వారా మలేరియాను నిర్మూలించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రాకేశ్, సతీశ్, సిబ్బంది మంగమ్మ, రామలింగయ్య, దేవిక, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి కిరణ్‌రాజ్ మాట్లాడారు. సమష్టిగా మలేరియాను జయించాలని సూచించారు. మలేరియా నుంచి రక్షణ కోసం నూతన ఆవిష్కరణలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సాంబయ్య, రమణ, రహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.



దుగ్గొండిలో..



గీసుకొండలో..

గీసుకొండ : మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అర్చన, సీహెచ్ఓ మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమార్, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్‌రెడ్డి

నర్సంపేట : ఓటు ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలమని ఏపీలోని పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి తేటతెల్లం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా మెరుగైన పాలన అందించగల నాయకులకు ఓటేయాలని సూచించారు. అర్హులందరూ ఖచ్చితంగా ఓటేయాలని చెప్పారు. ఓటుకు ఉన్న శక్తిపై ప్రజలను చైతన్యవంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. సదస్సులో కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఏ.శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.రమేశ్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.శైలజ, టి.రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ జి.ప్రసూన, ఎం.సమ్మయ్య, డాక్టర్ టి.సుమతి, ఎం.నరేందర్, పి.త్యాగయ్య, డాక్టర్ వి.పూర్ణచందర్, డాక్టర్ ఆర్.కుమారస్వామి, పి.సునీల్, నిజాముద్దీన్, నాన్ టీచింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం



గీసుకొండ : మండలంలోని గొర్రెకుంట గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం గురువారం వేడుకగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేసి ప్రోత్సహించారు. శిబిరాన్ని వినియోగించుకోవాలని హెచ్ఎం నలిమెల జ్యోతిర్మయి కోరారు. కార్యక్రమంలో పీఈటీ, కోచ్ రఘువీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ

నల్లబెల్లి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో ఓటర్ స్లిప్పులను పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మనుగొండ సూర్య పవన్, తంగేళ్ల వుణు, మల్టీపర్పస్ వర్కర్స్ పులి చక్రపాణి, గుండెబోయిన ఐలయ్య, లొనె లింగయ్య పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌తో బాలల వికాసం



నర్సంపేట : వర్క్ బుక్‌లను చూపిస్తున్న విద్యార్థులు



చెన్నారావుపేట : మాట్లాడుతున్న టీచర్ విజయలక్ష్మి

నర్సంపేట : అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్‌తో బాలలు వికాసం చెందుతారని అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి తెలిపారు. నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని 4వ నంబర్ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఈసీఈఈ డేలో బాలల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల వర్క్ బుక్‌లను ప్రదర్శించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ భారతి మాట్లాడారు. పూర్వ ప్రాథమిక విద్య ద్వారా ఆటపాటలతోపాటు బాలల శారీరక, మానసిక అభివృద్ధికి పునాది పడుతుందని తెలిపారు. గతేడాది 40 మంది విద్యార్థులు ప్రీ స్కూల్‌కు నమోదయ్యారని చెప్పారు. మే నెలలో ప్రతీరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లులు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎల్ఎంఎస్‌సీ సభ్యులు క్యాతం తేజశ్రీ, గద్దం భవాని, ఆర్పీ వేల్పుల రజిత, ఆయా పైండ్ల సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో..

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ఆటపాటలతో విద్య అందించడంతోపాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో విద్యాబోధన లభిస్తుందని చెఆప్పరు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, సరోజన, ఆయాలు నీలమ్మ, కట్టమ్మ, శారద, కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీధర్

నర్సంపేట : ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ విమర్శించారు. పట్టణంలోని సర్వే నంబర్ 702లోని ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. పట్టణంలోని సర్వే నంబర్ 111లో భూమి కొనుగోలు చేసిన పేద వ్యక్తి ఇల్లు కట్టుకుంటుంటే ప్రభుత్వ భూమి అంటూ ఆ శాఖల అధికారులు కూల్చేశారని చెప్పారు. అలాగే సర్వే నంబర్ 702లోని ప్రభుత్వ భూమిలో ఓ సంపన్నుడు రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మిస్తే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంలోని ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. లంచాలు ఇవ్వరనే కారణంతో పేదల ఇళ్లు కూల్చుతే సంపన్నులు ముడుపులు అప్పగిస్తే ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పట్టాలివ్వాలని, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని, సర్వే నంబర్ 702లోని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు కందికొండ రాజు, నాయకులు మొలుగూరి రాజు, దాసరి నరేశ్, మద్దెల నాగరాజు, వీరన్న, సుధాకర్, పులిచేరు చందు, జార్జ్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కృతజ్ఞత సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

రాయపర్తి : మే 2న కేఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న రెడ్డి కృతజ్ఞత సభకు మండలంలోని రెడ్డి కులస్తులందరూ తరలిరావాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని మైలారంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో ఆమోద ముద్ర వేయడంతో రాష్ట్రంలోని రెడ్డి కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులలోపే కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రకటించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతోందని చెప్పారు. కృతజ్ఞత సభకు రెడ్డి కులస్తులు తరలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పైడిపెల్లి భీమారెడ్డి, నాయకులు వరంగల్ కృష్ణారెడ్డి, పరిపాటి రాజు, తుమ్మ భూపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి



నర్సంపేట : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మాధవరెడ్డి, నాయకులు

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : మోదీ ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి తరిమికొట్టాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు గండి గిరితోపాటు 30 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చిందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి 42 రోజులే పని కల్పిస్తోందని ఆరోపించారు. తెలంగాణను కేసీఆర్ సర్వనాశనం చేశారన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని స్పష్టం చేశారు. మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట మండల అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్‌నాయక్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, నాయకులు చింతల సాంబరెడ్డి, ఎర్ర యాకుబ్‌రెడ్డి, బాణాల శ్రీనివాస్ ప్రసన్న, తుమ్మలపల్లి సందీప్ పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్ గాలి..

నెక్కొండ : దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని అలంకానిపేటలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాట్లాడారు. అనంతరం బీఆర్‌ఎస్‌కు రెడ్లవాడ పీఏసీఎస్ డైరెక్టర్లు కోరుకొండ మల్లయ్య, మాదాసు సుధాకర్, నాయకులు ఎలేందర్, రాజేశ్వర్, వెంకన్న, లక్ష్మయ్య, శ్రీను, కుమారస్వామి, రమేష్, సుధాకర్, మురళి, సతీష్, రాహుల్, సమ్మయ్య, యాకయ్య తదితరులు దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతీ ఇల్లు పుస్తక నిలయం కావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, కాసుల రవికుమార్

నర్సంపేట : ప్రతి ఇల్లు పుస్తక నిలయంగా మారాలని స్థానిక ఏసీపీ కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. లీడ్ లైబ్రరీ అండ్ లిటరరీ సెంటర్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ 'మై హోమ్–మై లైబ్రరీ' ఛాలెంజ్‌కు శ్రీకారం చుట్టగా పోస్టర్‌ను ఏసీపీ కిరణ్‌కుమార్ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలకు బాల్యం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. లీడ్ లైబ్రరీ గతంలో ప్రారంభించిన 'హగ్ ఏ బుక్' ఛాలెంజ్‌కు స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రస్తుతం 'మై హోమ్–మై లైబ్రరీ' నినాదంతో విద్యార్థులు సొంతంగా ఇంట్లోనే గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకోవాలని సవాలు విసరడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు సవాలును స్వీకరించి ఇళ్లలోనే గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో అభివృద్ధి చెందిన దేశాల్లోనూ పుస్తక పఠనానికే మొదటి ప్రాధాన్యత ఉందన్నారు. రవికుమార్ మాట్లాడుతూ ఇంట్లోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకునే విద్యార్థులకు బహుమతులతోపాటు మరిన్ని పుస్తకాలను అందిస్తామని చెప్పారు.

రైతులకు 'ఆగ్రోస్' సేవలు హుళక్కేనా?



రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

నల్లబెల్లి : తెలంగాణ ఆగ్రోస్ ద్వారా రైతులకు సేవలు అందడం హుళక్కేనా? అన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. కల్తీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులతో రైతులు నష్టపోకుండా గత ప్రభుత్వం తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ పనిముట్లు అందించడంతోపాటు రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కేంద్రాలు కృషి చేయాల్సి ఉంది. బీఎస్సీ పూర్తి చేసిన అభ్యర్థులకు రైతు ఆగ్రోస్ కేంద్రాల ఏర్పాటుతో ఉపాధి కూడా లభించాల్సి ఉంది. ఒకే చోట ఎరువులు, పురుగుల మందులు, సాగుకు ఉపయోగపడే యంత్ర పరికరాలు ఉంటాయని రైతులు ఆశించారు. కాగా అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిందన్న వేదన రైతన్నల్లో కనపడుతోంది. మండలంలో తెలంగాణ రైతు సేవా కేంద్రాలు కానరావడం లేదు. రైతులకు సేవలు అందడం లేదు.

ఇదీ పరిస్థితి..

మండలంలో మూడు రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మండల కేంద్రానికి చెందిన రెండు షాపుల నిర్వహణ కనపడడం లేదు. ఒకటో నంబర్ సేవా కేంద్రం నిర్వాహకుడి వ్యక్తిగత కారణాలతో కొంత కాలంగా నడవడం లేదు. రెండో నంబర్ కేంద్రాన్ని నేటికీ ప్రారంభించలేదు. అయినా వ్యవసాయ శాఖ అధికారులు నిర్వాహకుడితో లోపాయికారీగా కుమ్మక్కై ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తుండడంతో ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులో అధిక రేట్లకు అమ్ముకుంటున్నారన్న అపవాదు ఉంది. అధికారులు తనిఖీ చేయకుండా వదిలేస్తున్నారనడానికి దీన్ని ఉదాహరణగా చెప్పవచ్చు. శనిగరం గ్రామానికి చెందిన కేంద్రం మాత్రమే రైతులకు సేవలు అందిస్తోంది. షాపుల నిర్వహణ చేపట్టని వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

రైతు సేవా కేంద్రాలను వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించడం లేదన్న విమర్శలున్నాయి. నిర్వాహకులతో కుమ్మక్కై పర్యవేక్షణను గాలికొదిలేశారన్న వ్యాఖ్యలు బహిరంగంగానే వినవస్తున్నాయి. ఇకనైనా వ్యవసాయ శాఖ జిల్లా స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కార్మిక చట్ట సవరణలపై ఉద్యమించాలి



నర్సంపేట : కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్ట సవరణలపై ఉద్యమించాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో యువరాజు మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరించిందని కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, కనీస వేతన చట్టం, హక్కుల కోసం పోరాడే సమ్మె హక్కులను కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా సవరించిందని తెలిపారు. మే డేను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, నాయకులు గాండ్ల రాములు, భిక్షపతి, అనిల్, చంద్రమౌళి, కుమార్ పాల్గొన్నారు.

జర్నలిజంతో బంగారు భవిష్యత్‌కు బాటలు



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

వర్ధన్నపేట : జర్నలిజం విద్యతో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలన శాస్త్ర సహాయ అధ్యాపకుడు డాక్టర్ పి.వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'జర్నలిజంలో ఉపాధి అవకాశాలు' అంశంపై ప్రిన్సిపాల్ పోశయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో వేణుగోపాల్ అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిజం ప్రజాచైతన్యానికి పాటుపడుతుందని చెప్పారు. ప్రజలను ప్రగతిశీల ఆలోచనల దిశగా నడిపిస్తుందని తెలిపారు. సృజనాత్మకత, శ్రమించే తత్వం, భాషపై పట్టు ఉంటే జర్నలిజంలో అత్యుత్తమ స్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ పోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జర్నలిజం కోర్సు అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జర్నలిజం కోర్సులో చేరి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన మీడియా రంగంలో ప్రతిభ కనబరిస్తే జాతీయ స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. అనంతరం వేణుగోపాల్‌ను అధ్యాపకులు సన్మానించారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ సమత, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డాక్టర్ మాలతీలత, శ్రీనివాసరావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ బి.శ్వేత, డాక్టర్ సుధారాణి, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న రాజుయాదవ్, నాయకులు

ఖానాపురం : ఎంపీగా బీజేపీ తరఫున బరిలో నిలిచిన సీతారాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ కోరారు. మండలంలోని బుధరావుపేట, మంగళవారిపేట గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుయాదవ్ మాట్లాడారు. ఎంపీగా సీతారాంనాయక్ గెలిస్తే నియోజకవర్గాన్ని, మండలాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జల్లి మధు, నాయకులు పాపయ్య, కిరణ్, కల్యాణి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.